సాక్షి
నంద్యాల
శనివారం । 11 । నవంబర్ । 2023



ఉమ్మడి జిల్లాకు వర్ష సూచన

ఎమ్మిగనూరురూరల్: ఉమ్మడి కర్నూలు జిల్లాలో శనివారం నుంచి 15వ తేదీ వరకు ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ విభాగం శాస్త్రవేత్త మహదేవయ్య తెలిపారు.



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: నిత్యాన్నదాన పథకానికి బాపట్లకు చెందిన బి.ఆనంద్‌బాబు, హైదరాబాద్‌కు చెందిన ఐ.సుబ్రహ్మణ్యం దంపతులు రూ.1,00,500 చొప్పున విరాళాన్ని అందజేశారు.



శాస్త్రోక్తంగా ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మవార్లకు శుక్రవారం ఊయలసేవను శాస్త్రోక్తంగా నిర్వహించారు. గ్రామ దేవత అంకాళమ్మ అమ్మవారికి అభిషేకం చేశారు.

‘భూమా’ విలాపం

నంద్యాల బరి నుంచి భూమా బ్రహ్మానందరెడ్డి ఔట్!

- ఫరూక్‌కు టిక్కెట్ ఇచ్చే దిశగా టీడీపీ అధిష్టానం
- ఆ పార్టీని వీడే యోచనలో బ్రహ్మం
- టీడీపీ అంతర్గత సర్వేలో ఆళ్లగడ్డలో టీడీపీకి పరాభవం
- ఈ నేపథ్యంలో పొత్తులో భాగంగా జనసేనకు ఆళ్లగడ్డ
- తాజా పరిణామాలతో రాజకీయాల్లో ‘భూమా’ కుటుంబం తెరమరుగు
- ఇప్పటికే ప్రత్యామ్నాయాల దిశగా శ్రేణులు

‘భూమా’ పేరు రాజకీయాల నుంచి కనుమరుగు కానుందా? నంద్యాల బరిలో నుంచి భూమా బ్రహ్మానందరెడ్డిని కాకుండా ఫరూక్‌ను బరిలోకి దించనున్నారా? ఆళ్లగడ్డలో కూడా అఖిల ఆశలపై నీళ్లు చల్లినట్లేనా? టీడీపీలో తాజా రాజకీయ పరిణామాలను పరిశీలిస్తే అవుననే సమాధానం వస్తోంది. నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాలపై టీడీపీ అధిష్టానం తీసుకున్న నిర్ణయాలు, ఇన్‌చార్జ్‌లతో ఆ పార్టీ అధినేతలు సాగిస్తున్న చర్చలు ఈ విషయాలనే వెల్లడి చేస్తోంది. పార్టీ నిర్ణయంతో భూమా బ్రహ్మానందరెడ్డి టీడీపీకి రాజీనామా చేసే యోచనలో ఉన్నట్లు చర్చ జరుగుతోంది.





అఖిలకు అందరూ దూరమే..

- నాగిరెడ్డి మృతి తర్వాత రాజకీయంగా కీలకంగా వ్యవహరించిన ఏవీ సుబ్బారెడ్డి ఇప్పటికే దూరమయ్యాడు.
- ‘భూమా’కు అత్యంత సన్నిహితుడు శివరామిరెడ్డి, విజయడైరీ చైర్మన్‌గా కొనసాగిన భూమా నారాయణ రెడ్డి, అఖిల పెదనాన్న భాస్కర్‌రెడ్డి కుమారుడు భూమా కిషోర్‌రెడ్డితో పాటు బంధువర్గం, సన్నిహితులు ఆ గుమ్మం తొక్కడమే మానేశారు.
- ‘భూమా’ కుటుంబం సొంత మండలం దొర్నిపాడులోనే వారికి వ్యతిరేకంగా సర్వేలు వచ్చాయంటే మిగిలిన మండలాల్లో పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

సాక్షి ప్రతినిధి కర్నూలు: రాయలసీమలో టీడీపీ అత్యంత బలహీనంగా ఉన్న జిల్లాల్లో ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రథమ స్థానంలో ఉంది. గత 20 ఏళ్లలో ఇక్కడ టీడీపీ అత్యధికంగా గెలిచింది నాలుగు అసెంబ్లీ స్థానాలు మాత్రమే. వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ ఇక్కడ ఎంత బలంగా ఉందో టీడీపీ అధిష్టానానికి కూడా స్పష్టంగా తెలుసు. పైగా టీడీపీ రాజకీయ వ్యవహారాలను పర్యవేక్షించే ఓ సంస్థ చేసిన సర్వేల్లో కూడా కర్నూలు జిల్లాలో 2019 ఎన్నికల ఫలితాలే పునరావృతం అవుతాయని స్పష్టమైనట్లు సమాచారం. ఈ క్రమంలో టిక్కెట్ల ఖరారుపై టీడీపీ ఒక్కో అడుగు ముందుకేస్తోంది. డోన్ పర్యటనకు వచ్చిన చంద్రబాబునాయుడు ఆ నియోజకవర్గ అభ్యర్థిగా ధర్మవరం సుబ్బారెడ్డిని ఇదివరకే ప్రకటించారు. అయితే డోన్ బరిలో కచ్చితంగా కేఈ కుటుంబం ఉంటుందని, పోటీ చేసి తీరుతుందని కేఈ ప్రభాకర్ తేల్చిచెప్పారు. ఈ టిక్కెట్ బీసీ జనార్దన్‌రెడ్డి సూచన మేరకే చంద్రబాబు ప్రకటించారని ఆ పార్టీలో చర్చ నడుస్తోంది. ఇదే క్రమంలో నంద్యాల నుంచి భూమా బ్రహ్మానందరెడ్డిని తప్పించేందుకు బీసీ జనార్దన్‌రెడ్డి రెండేళ్లుగా పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. బ్రహ్మానందరెడ్డిపై చంద్రబాబుకు ప్రతీ సందర్భంలో కూడా ఫిర్యాదులు చేశారు. ఇది గ్రహించిన బ్రహ్మం ఇటీవల నంద్యాలకు వచ్చి అరెస్టయ్యే ముందురోజు బీసీ జనార్దన్‌రెడ్డిపైనా ఫిర్యాదు చేశారు. దీంతో నంద్యాల బహిరంగసభలో బ్రహ్మం అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయాలని ‘భూమా’ అనుచరులు నినాదాలు చేసినా చంద్రబాబు ఎవ్వరి పేరు ప్రకటించనని, సర్వేలను బట్టి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ క్రమంలో ఫరూక్‌ను నంద్యాల అభ్యర్థిగా టీడీపీ దాదాపు ఖరారు చేసినట్లు తెలిసింది. టీడీపీ అనుకూల మీడియాలో కూడా ఈ వార్తలు ప్రచురితమయ్యాయి. ఈ నేపథ్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించి పార్టీని వీడాలని బ్రహ్మం నిర్ణయించుకున్నట్లు ఆ పార్టీలోనే చర్చ కొనసాగుతోంది. ఇది తెలిసి టీడీపీ అధిష్టానం ఫరూక్, బ్రహ్మంలను పిలిపించి ఫరూక్‌కు మద్దతు ఇవ్వాలని, మీకు ఎమ్మెల్సీ ఇస్తామని చెప్పినట్లు తెలిసింది. ఇందుకు బ్రహ్మం ససేమిరా అని మధ్యలోనే లేచి వచ్చేశాడని సమాచారం. త్వరలోనే టీడీపీకి రాజీనామా చేసేందుకు సిద్ధమైనట్లు ఆయన అనుచరులు చర్చించుకుంటున్నారు.

ఎలాగూ ఓటమి తప్పదని జనసేనకు..

ఎవరికి టిక్కెట్ ఇచ్చినా ఆళ్లగడ్డలో గెలిచే పరిస్థితులు లేకపోవడం, మరోవైపు బలిజ ఓటర్లు అధికంగా ఉండటంతో పొత్తులో భాగంగా ఈ స్థానం జనసేనకు కట్టబెడదామనే నిర్ణయానికి టీడీపీ వచ్చినట్లు తెలిసింది. ఎలాగూ ఓడిపోయే సీటు, పొత్తులో ఇస్తే సరిపోతుంది, పైగా బలిజలు అధికంగా ఉన్నారు కాబట్టి ఆళ్లగడ్డ లాంటి కీలక స్థానం జనసేనకు ఇచ్చామని చెప్పుకునేందుకు బాగుంటుందనే నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ఈ చర్చలు జరుగుతున్న తరుణంలోనే ఇరిగెల రాంపుల్లారెడ్డి జనసేన పార్టీలో చేరారు. పొత్తులో భాగంగా జనసేన టిక్కెట్ తనకే వస్తుందని ఆయన కూడా ధీమా వ్యక్తం చేస్తున్నారు. అయితే ఆళ్లగడ్డ నుంచి బలిజ సామాజిక వర్గానికి చెందిన వారికే టిక్కెట్ ఇస్తే బాగుంటుందని పవన్‌కళ్యాణ్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదిలాఉంటే ఎమ్మెల్యే టిక్కెట్ దక్కించుకునేంత శక్తి తన నియోజకవర్గంలోని బలిజ సామాజికవర్గంలో లేరని, కాబట్టి టిక్కెట్ తనకే వస్తుందని ఇరిగెల తన వర్గీయులతో చెబుతుండటం గమనార్హం. ఏదిఏమైనా ఓ వైపు నంద్యాలలో బ్రహ్మానందరెడ్డి, మరోవైపు ఆళ్లగడ్డలో అఖిల ప్రియకు టిక్కెట్లు దక్కకపోతే ‘భూమా’ కుటుంబం తొలిసారి పోటీలో లేని పరిస్థితి తలెత్తుంది. ఇదే జరిగితే రాజకీయాల్లో ‘భూమా’ కుటుంబం తెరమరుగైనట్లే!

భూమా బ్రహ్మానందరెడ్డికి కాకుండా తన సోదరుడు జగత్ విఖ్యాత్‌కు టిక్కెట్ దక్కించుకోవాలని అఖిల శతవిధాల ప్రయత్నాలు చేశారు. ఈ క్రమంలోనే అఖిల, బ్రహ్మానికి మధ్య విభేదాలు కూడా తారస్థాయికి చేరాయి. ఇద్దరి విభేదాలతో పరస్పరం బలాన్ని తగ్గించుంటున్నామనే విషయాన్ని గ్రహించలేకపోయారు. ఆళ్లగడ్డలో అఖిలప్రియకు ఘోర పరాభవం తప్పదని రాబిన్‌శర్మ టీం అధిష్టానానికి నివేదికలు ఇచ్చినట్లు టీడీపీలో చర్చ నడుస్తోంది.

స్వయంకృతాపరాధం

దీంతో అఖిలకు కాకుండా భూమా కిషోర్‌ను టీడీపీలోకి ఆహ్వానించి టిక్కెట్ ఇవ్వాలని ఆ పార్టీ తొలుత భావించింది. అయితే కిషోర్‌కు ఇచ్చినా అఖిల వర్గం మద్దతు ఇవ్వదని గ్రహించింది. ప్రజల్లో నిత్యం ఉంటూ, నియోజకవర్గాన్ని అభివృద్ధి బాట పట్టిస్తోన్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి ద్వయం చేతిలో కిషోర్ కూడా ఓటమిని తప్పించుకోలేరని తేలినట్లు తెలుస్తోంది. దీంతో నియోజకవర్గంలో 45వేల బలిజ సామాజిక వర్గం ఓటర్లు ఉన్నారని, వారికి టిక్కెట్ ఇద్దామనే ఓ చర్చ నడిచింది. దీనికి బీసీ జనార్దన్‌రెడ్డి కూడా మద్దతు పలికినట్లు సమాచారం. ఇదే క్రమంలో బోండా ఉమ, ఏవీ సుబ్బారెడ్డి కుమార్తెకు టిక్కెట్ ఇవ్వాలని సిఫార్సు చేసినట్లు తెలిసింది. అయితే ఈ నిర్ణయం కూడా గెలుపును దక్కించుకునేది కాదని తేలినట్లు చర్చ జరుగుతోంది.

న్యూస్‌రీల్

మల్లన్న సేవలో మాజీ సీజేఐ ఎన్.వి. రమణ



శ్రీశైల ఆలయ ప్రాంగణంలో మాజీ సీజేఐ ఎన్.వి. రమణ దంపతులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలం శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లను సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి. రమణ దంపతులు దర్శించుకున్నారు. శుక్రవారం రాత్రి శ్రీశైలం చేరుకున్న వీరికి భ్రమరాంబా అతిథిగృహం వద్ద దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు, పలువురు జిల్లా అధికారులు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మవార్లను ధూళీ దర్శనం చేసుకున్నారు. అలాగే స్వామి అమ్మవార్లకు నిర్వహించిన ఊయలసేవలో మాజీ ప్రధాన న్యాయమూర్తి దంపతులు పాల్గొన్నారు. శనివారం తెల్లవారుజామున మల్లికార్జున స్వామివారికి రుద్రాభిషేకం, భ్రమరాంబాదేవికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకుంటారని ఆలయ అధికారులు తెలిపారు.

బెట్టను తట్టుకునే పంటలు వేసుకోవాలి



మాట్లాడుతున్న నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి

బనగానపల్లె రూరల్: వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు బెట్టను తట్టుకునే పంటను వేసుకోవాలని నాబార్డు డీడీఎం ఎం సుబ్బారెడ్డి సూచించారు. యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రంలో వాతావరణ అనుకూల వ్యవసాయ విధానాలపై శుక్రవారం జిల్లా స్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు వ్యసాయ అధికారుల సూచనలు, సలహాలను పాటిస్తూ పంటల సాగు చేయాలన్నారు. నీటి కుంటల యాజమాన్యంపై శాస్త్రవేత్త డాక్టర్ బీ సహదేవరెడ్డి అవగాహన కల్పించారు. కేవీకే ప్రధాన శాస్త్రవేత్త ధనలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సుధాకర్, బాలరాజు, కృష్ణమూర్తి, ఆదినారాయణ మాట్లాడారు.

శ్రీశైలం ఘాట్‌లో చిరుత మృతి

- సుమారు ఆరు నెలల ఆడ చిరుతగా గుర్తించిన అటవీ అధికారులు



శ్రీశైలం టెంపుల్: శ్రీశైలం రహదారిలో గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ చిరుత అక్కడికక్కడే మరణించింది. శుక్రవారం రాత్రి శ్రీశైలం రహదారిలో చిరుత మృతి విషయాన్ని స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఆ వెంటనే శ్రీశైలం రేంజ్ అటవీ అధికారి నరశింహులు నేతృత్వంలో సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని సుమారు ఆరు నెలల ఆడ చిరుత మరణించినట్లు గుర్తించారు. మృతికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఇదిలాఉంటే శ్రీశైలంలో చిరుత మృతి సంచలనంగా మారింది. గతంలో శ్రీశైల ముఖద్వారం వద్ద కూడా ఓ చిరుత గుర్తుతెలియని వాహనం ఢీకొని మరణించింది.

అంతర్జాతీయ క్రీడాకారుడికి ఘన స్వాగతం



వెంకటనారాయణకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

ప్యాపిలి: అంతర్జాతీయ క్రీడాకారుడు కొంగనపల్లి వెంకటనారాయణకు శుక్రవారం ప్యాపిలిలో ఘనస్వాగతం లభించింది. గత నెల 26 నుంచి 28 వ తేదీ వరకు చైనాలోని హంగ్‌జోలో రోయింగ్ పీఆర్3 మిక్స్‌డ్ డబుల్ పోటీల్లో ఈ క్రీడాకారుడు సిల్వర్ మెడల్ సాధించారు. ప్రధాని నరేంద్ర మోదీతో ప్రశంసలు అందుకున్నారు. స్వదేశానికి చేరుకున్న వెంకటనారాయణ శుక్రవారం స్వస్థలమైన ప్యాపిలికి వచ్చారు. ఈ సందర్భంగా వెంకటనారాయణకు మిత్రులు, విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు.

నెలాఖరు వరకు కేసీకి నీరు

- రైతులు ఆందోళన చెందవద్దు
- కేసీ కెనాల్ ఈఈ, ఏఈ



నిండుగా ప్రవహిస్తున్న కేసీ కాల్వ

జూపాడుబంగ్లా/ఆళ్లగడ్డ: కేసీ కెనాల్ ఆయకట్టు రైతులు ఆందోళన చెందవద్దని, ప్రస్తుతం ఉన్న నీటిని వారబందీ ప్రకారం ఈ నెలాఖరి వరకు అందించనున్నట్లు ఈఈ తిరుమలేశ్వర్‌రెడ్డి, ఏఈ నరేష్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలతో సుంకేసులకు ఇన్‌ఫ్లో వస్తోందన్నారు. సుంకేసుల నుంచి 2,200, ముచ్చుమర్రి నుంచి 700 క్యూసెక్కుల చొప్పున కేసీ కాల్వకు నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. రైతుల వినియోగార్థం లాకిన్స్‌లా వరకు చేరుతున్న నీటిని నిప్పులవాగుకు 1,700, తూడిచెర్ల సబ్‌చానల్‌కు 600, ఏబీఆర్ కాల్వకు 20 క్యూసెక్కుల చొప్పున వదులుతున్నామన్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే డిసెంబర్, జనవరి వరకూ కూడా నీరు విడుదల చేసే అవకాశం ఉంటుందని, రైతులు నీటిని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

డీఎడ్ నాలుగో సెమిస్టర్ పరీక్ష ఫలితాల విడుదల

కర్నూలు (న్యూటౌన్): డీఎడ్ నాలుగో సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయని జిల్లా విద్యాశాఖాధికారి వి రంగారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పరీక్షలను సెప్టెంబర్ 19 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించామని, 2021–23 రెగ్యులర్ విద్యార్థులతోపాటు ఫెయిల్ అయిన వారు హాజరయ్యారని తెలిపారు. మొత్తం 1,608 మంది హాజరు కాగా 1,548 మంది (96.26 శాతం) ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు. డమ్మీ మార్కుల జాబితాలను www. bse. ap. gov. in నుంచి పొందవచ్చని తెలిపారు. రీకౌంటింగ్‌కు ఒక సబ్జెక్టుకు రూ.500 చలానాను ఏపీసీఎఫ్‌ఎంఎస్ విధానం ద్వారా మాత్రమే చెల్లించాలని సూచించారు.

చిన్న సమస్యలూ పరిష్కరించలేరా?


- పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవు
- అధికారులను హెచ్చరించిన జిల్లా కలెక్టర్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ

మిడుతూరు: గ్రామ స్థాయిలోని చిన్న సమస్యలు కూడా ఎందుకు పరిష్కారం కావడం లేదని అధికారులపై జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పనితీరు మార్చుకోకపోతే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్థానిక వెలుగు కార్యాలయ ఆవరణలో శుక్రవారం జగనన్నకు చెబుదాం– స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి వారం గ్రామ సచివాలయ స్థాయిలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించినా సమస్యలు ఎందుకు పరిష్కారం కావడం లేదని ఎంపీడీఓ జీఎన్ఎస్‌రెడ్డి, తహసీల్దార్ ప్రకాష్‌బాబులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు ప్రతి సమస్యను ప్రాధాన్యతగా తీసుకొని పరిష్కరించాలని ఆదేశించారు. మండలంలో అధికారులు పనిచేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయన్నారు. కార్యక్రమానికి 117 అర్జీలు రాగా.. వాటిపై అధికారులతో సమీక్షించారు. భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్యం లోపించిందని, నీటి, విద్యుత్ సమస్యలపై అర్జీలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో పుల్లయ్య, ఆర్‌డీఓ దాసు, జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు, జిల్లా హార్టికల్చర్ అధికారి నాగరాజు, మిడుతూరు సర్పంచ్ జయలక్ష్మమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు పర్వత యుగంధర్‌రెడ్డి, ఎంపీపీ మల్లు వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

‘మోడల్’ టీచర్లకు ఈహెచ్ఎస్ అభయం



జూపాడుబంగ్లా మోడల్ పాఠశాల

- 271జీవోను విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాలో 720 మందికి లబ్ధి
- మెడికల్ రీయింబర్స్‌మెంట్ పొందే అవకాశం

జూపాడుబంగ్లా: ఆదర్శ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు ఈహెచ్ఎస్(ఎంప్లాయిస్ హెల్త్ స్కీం) వర్తింపజేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు 271జీవోను విడుదల చేసింది. దీంతో ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 36 మోడల్ స్కూళ్లు ఉండగా 720 మంది ఉపాధ్యాయులు 2013 నుంచి విధులు నిర్వహిస్తున్నారు. ఈహెచ్ఎస్ సౌకర్యం లేకపోవడంతో చిన్న పాటి వైద్యానికి, శస్త్ర చికిత్స కోసం వేల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది. టీడీపీ హయాంలో అప్పటి పాలకులు వీరి సమస్యను పట్టించుకోలేదు. పెద్ద మనసుతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి స్పందించి మోడల్ పాఠశాలల ఉపాధ్యాయులకు సైతం ఈహెచ్ఎస్ వర్తింపజేస్తూ జీవో 271ని విడుదల చేశారు. దీంతో వైద్యం కోసం వెచ్చించిన మొత్తం మెడికల్ రీయింబర్స్‌మెంటుకింద వెనక్కి వచ్చే అవకాశం ఉంది. ఉపాధ్యాయులు, వారి కుటుంబసభ్యులు ఎవరైనా దీర్ఘకాలిక జబ్బులబారిన పడినా, రోడ్డు ప్రమాదాలకు గురైనా ఈహెచ్ఎస్ కింద ఆసుపత్రుల్లో చికిత్స తీసుకోవచ్చు. అలాగే శస్త్రచికిత్సలు సైతం చేయించుకోవచ్చు. నంద్యాల జిల్లా పరిధిలో 20 పాఠశాలలుండగా అందులోని 400మంది ఉపాధ్యాయులకు, కర్నూలు జిల్లాలో 16 పాఠశాలలుండగా 320మంది ఉపాధ్యాయులకు ఈహెచ్ఎస్ వరంగా మారనుంది.

ఊరట లభించింది



ఈహెచ్ఎస్ కోసం పదేళ్ల నుంచి ఎదురు చూస్తున్నాం. మా నిరీక్షణకు తెరదించుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో 271ను విడుదల చేయటం అభినందించదగ్గ విషయం. ఈహెచ్ఎస్ అమలుతో ఎంతో ఊరట లభించింది.

– డి.రమేష్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, జూపాడుబంగ్లా

మెడికల్ ఖర్చుల భారం తగ్గుతుంది



ప్రభుత్వం అమలు చేస్తున్న ఈహెచ్ఎస్‌తో మాకు మెడికల్ ఖర్చుల భారం తగ్గుతుంది. పదేళ్ల నుంచి ఈహెచ్ఎస్ లేక తీవ్ర ఇబ్బందులకు గురయ్యాం. ఈ పథకం అమలుతో మాతో పాటు కుటుంబసభ్యులకు చాలా సంతోషంగా ఉంది.

– సుభాకరుడు, సివిక్స్, ఉపాధ్యాయుడు

శ్రీశైల క్షేత్రం అభివృద్ధే ప్రధాన లక్ష్యం

- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన 100 కుటుంబాలు



టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

ఆత్మకూరు: తాను టీడీపీ మాజీ ఎమ్మెల్యేలా దోచుకోవడం, దాచుకోవడం జరగదని, శ్రీశైల క్షేత్రం అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నానని ఎమ్మెల్యే, ఎథిక్స్ కమిటీ చైర్మన్ శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలుపొందిన వెంటనే క్షేత్రాన్ని ఎంతో అభివృద్ధి చేశానని తెలిపారు. భ్రమరాంబా మల్లికార్జునస్వామివార్ల ఆశీస్సులతో రింగ్ రోడ్డు నిర్మించామన్నారు. శ్రీశైలంలోని వంద కుటుంబాలకు చెందిన టీడీపీ కార్యకర్తలు శుక్రవారం పట్టణంలోని కార్యాలయంలో వైఎస్సార్‌సీపీలోకి చేరారు. ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి వీరికి వైఎస్సార్‌సీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్షేత్రంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. డార్మిటరీలు, విశాలమైన రహదారులతో పాటు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించామని పేర్కొన్నారు. తనపై నమ్మకంతో 30 ఏళ్ల నుంచి టీడీపీలో కొనసాగుతున్న గోకారి మల్లయ్య, తెలుగు నారాయణ, శ్రావణ్‌కుమార్ లాంటి వ్యక్తుల ఆధ్వర్యంలో వంద కుటుంబాల సభ్యులు వైఎస్సార్‌సీపీలో చేరడం హర్షించదగ్గ విషయం అన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా శ్రీశైలంలో అందరి అభివృద్ధికి తాను కృషి చేస్తున్నానని తెలిపారు. శ్రీశైలంలో నివసిస్తున్న వారిని సున్నిపెంటకు తరలించాలని అధికారులు చెప్పారని, అయితే అలాంటివి జరగబోవని తాను చెప్పానన్నారు. తాను ఎమ్మెల్యేగా కొనసాగినన్ని రోజులు శ్రీశైలంలోని వారు శ్రీశైలంలోనే నివశిస్తారన్నారు. అందరికీ పక్కాగృహాలు ఇవ్వడమే కాకుండా శ్రీశైల క్షేత్రంలో 5,300 ఎకరాల భూమిని సైతం గుర్తించామని చెప్పారు. శ్రీశైలంలో నివసించే వారికి ఉద్యోగాలు సైతం అక్కడే ఇచ్చి, పేదలు సైతం అభివృద్ధి చెందేలా కృషి చేశానన్నారు. అందరికీ మంచినీరు, ఇంటింటికి త్వరలో మీటర్లు అందిస్తామన్నారు. ఇంటికి రూ.3 వేలు, షాపుకు రూ.5 వేల చొప్పున చెల్లించేలా త్వరలో కోర్టు నుంచి ఆదేశాలు వస్తాయని భావిస్తున్నానని, అవి వచ్చాక అదే రీతిలో ప్రజలు చెల్లించాలన్నారు. తాను మాటలు చెప్పే రకం కాదని, చేతలతో సహాయం అందిస్తామన్నారు.

అభివృద్ధిని చూసి పార్టీలో చేరాం

ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి చేసే అభివృద్ధిని చూసే వైఎస్సార్‌సీపీలో చేరామని గోకారి మల్లయ్య, తెలుగు నారాయణ, నాగమల్లయ్య, శ్రావణకుమార్‌లు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో శిల్పా చక్రపాణి రెడ్డికి శ్రీశైలం మండలంలో అత్యధిక మెజార్టీ ఇస్తామన్నారు. శ్రీశైలం మండల నాయకులు రజాక్, అరుణకుమారి రెడ్డి, కుమార్, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమంగా టపాసులు విక్రయిస్తే చర్యలు



విక్రయదారులతో మాట్లాడుతున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: ప్రభుత్వ అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా టపాసులు నిల్వ ఉంచినా, విక్రయించినా వారిపై పేలుడు పదార్థాల చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ రఘువీర్ రెడ్డి హెచ్చరించారు. నంద్యాల గవర్నమెంట్ డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేస్తున్న బాణసంచా విక్రయ కేంద్రాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విక్రయదారులతో మాట్లాడుతూ.. ప్రమాదాలకు తావులేకుండా, సరైన భద్రతా ప్రమాణాలు పాటిస్తూ దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. నివాస ప్రాంతాల్లో, జనసంచారం ఉన్న ప్రదేశాలలో టపాకాయలు విక్రయించకుండా మైదాన ప్రాంతాల్లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎస్పీ వెంట జిల్లా స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సంతోష్, ఫైర్ డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ యోగేశ్వర్ రెడ్డి, సీఐలులు ప్రభాకర్ రెడ్డి, నరసింహులు, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

డ్యాంలో 63 టీఎంసీల నీరు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయంలో శుక్రవారం సాయంత్రం సమయానికి 63.0670 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాం నీటిమట్టం 840.80 అడుగులకు చేరుకుంది. ఎడమగట్టు భూగర్భజలవిద్యుత్ కేంద్రంలో 0.759 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి నాగార్జున సాగర్‌కు 1,533 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యాక్ వాటర్ నుంచి హంద్రీనీవా సుజలస్రవంతికి 1,210 క్యూసెక్కులు, ముచ్చుమర్రి ఎత్తిపోతలకు 632 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

24 నుంచి ఎస్ఏ1 పరీక్షలు

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 10 వ తరగతి వరకు ఎస్ఏ 1 పరీక్షలు ఈ నెల 24 నుంచి డిసెంబర్ 6వ తేదీ వరకు నిర్వహించాలని డీఈఓ సుధాకర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని పాఠశాలలకు ఈ నెల 13 వతేదీన దీపావళి సెలవు ప్రకటించినట్లు పేర్కొన్నారు.

‘పది’ ఫీజు చెల్లింపు గడువు పొడిగింపు

నంద్యాల(న్యూటౌన్): పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించే గడువును శుక్రవారం నుంచి ఈనెల 20వ తేదీ వరకు పొడిగించినట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి శుక్రవారం విలేకరులకు తెలిపారు. జిల్లాలోని అన్ని యాజమాన్య, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈ విషయాన్ని గమనించాలన్నారు. ప్రైవేట్, ఎయిడెడ్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఫీజు చెల్లింపునకు విద్యాశాఖాధికారి కార్యాలయం నుంచి అనుమతి పొందాలన్నారు.

పశుగ్రాసం కొరతను అధిగమించేందుకు చర్యలు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో పశుగ్రాసం కొరతను అధిగమించేందుకు పశుసంవర్ధక శాఖ చర్యలు చేపట్టింది. 24 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించిన నేపథ్యంలో రాబోయే 60 రోజుల్లో పశుగ్రాసం అవసరం ఎంత.. అందుబాటులో ఎంత ఉంది.. కొరత ఉంటే అధిగమించడానికి దాణామృతం(టీఎంఆర్) ఎంత అవసరం అనే విషయాలపై రాష్ట్ర పశుసంవర్ధక శాఖ నివేదిక కోరింది. కరువు మండలాల్లో 5,88,922 పశువులు ఉండగా.. వీటికి 60 రోజులకు ఎండు మేత 1,59,826 టన్నులు, పచ్చి మేత 3,98,506 టన్నులు అవసరం.అయితే అందుబాటులో ఎండుమేత 1,67,505 టన్నులు, పచ్చిమేత 3,89,438 టన్నులు ఉన్నట్లు స్పష్టమవుతోంది. 60 రోజుల్లో 1,389 టన్నుల కొరత ఏర్పడుతున్నట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ అంచనా వేసింది. ఆ మేరకు జిల్లా అధికారులు పశుసంవర్ధక శాఖ డైరెక్టర్‌కు నివేదించారు. మరోవైపు పశుగ్రాసం కొరతను అధిగమించేందుకు సబ్సిడీపై పశుగ్రాసం విత్తనాలు కూడా పంపిణీ చేస్తున్నారు.

చెడు ఆహారం వల్లే వ్యాధుల సంక్రమణ

కర్నూలు(హాస్పిటల్): చెడు ఆహారం వల్లే వ్యాధులు సంక్రమిస్తున్నాయని సీనియర్ ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి ద్వారం ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్, మాన్యుఫ్యాక్చరింగ్(ఐఐటీడీఎం)లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వ్యాయామం, యోగా, ధ్యానం, ఆధ్యాత్మిక ఆరోగ్యంతో పాటు సమతుల ఆహారం తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. వ్యక్తిగతంగా, సామాజికపరంగా తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే మానసిక, శారీరక రోగగ్రస్తులవుతారన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ ఆయుర్వేద వైద్యానికి పనికొచ్చే మూలికా తీగలు, మొక్కలు, చెట్లు పెంచాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీనియర్ ఆయుర్వేద వైద్యులు ఎండీవీఎస్ రామశర్మ, రిటైర్డ్ టీబీ అధికారి మోక్షేశ్వరుడు, ఐఐటీడీఎం డైరెక్టర్ డీవీఎల్ఎన్ సోమయాజులు, రిజిస్ట్రార్ కె.గురుమూర్తి పాల్గొన్నారు.

హరిత దీపావళిని ప్రోత్సహిద్దాం

- సంప్రదాయానికి స్వాగతం పలుకుదాం
- పర్యావరణ హితంగా పండుగ చేసుకుందాం
- టపాసులను నియంత్రించుకుందాం
- ప్రమిదలతోనే ఇంటికి అందం



కర్నూలు కల్చరల్: అమావాస్య చీకటిని జయించి సంతోషాలను పూయించే పండగ దీపావళి. ఈనెల 13న నరక చతుర్థశి (దీపావళి) సందర్భంగా ఆనందోత్సాహాల మధ్య కాంతుల పండుగను జరుపుకునేందుకు ప్రతి ఒక్కరూ ఉవిళ్లూరుతున్నారు. ఈక్రమంలో పర్యావరణ పరిరక్షణకు ఎకో ఫ్రెండ్లీ టపాసులను వినియోగించాలని పలు స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ ప్రేమికులు సూచిస్తున్నారు. దీపావళి కాంతులు ప్రతి ఇంటా వెదజల్లాలంటే జాగ్రత్తలు తప్పని సరి. ఎలాంటి అపశ్రుతి చోటుచేసుకోకుండా ప్రకృతికి మేలు చేసేలా సంతోషంగా దీపావళిని జరుపుకోవాలని కోరుతున్నారు.

ఎకో ఫ్రెండ్లీతో..

రంగులు విరజిమ్ముతూ పెద్ద పెద్ద శబ్దాలు చేస్తూ అందరినీ ఆకట్టుకునే టపాసులు లేకుండా దీపావళి పండుగ పూర్తి కాదనుకుంటారు. అలాంటి వారి కోసమే ఎకో ఫ్రెండ్లీ క్రాకర్స్ అందుబాటులోకి వస్తున్నాయి. కాన్ ఫెట్టీ, ఫ్లవర్ పవర్, ఫేక్ నోట్, బర్స్ట్, స్నేక్‌మిక్స్, ఫ్లవర్ పార్ట్స్, పెన్సిల్ లాంటి పేర్లతో మార్కెట్‌లో దొరుకుతున్నాయి. ఇవి మామూలు బాణ సంచాలా వాతావరణానికి పెద్దగా హాని కలిగించవు. వీటి ధ్వని పరిమిత దూరం వరకే ఉంటుంది. కాలుష్యం కలిగించని రంగురంగుల మెరుపులను వెదజల్లుతాయి. కేవలం గన్‌పౌడర్, ఫాస్ఫేట్‌ను మాత్రమే ఉపయోగించి ఆధునిక టెక్నాలజీతో ఈ వెరైటీ బాణ సంచాను తయారు చేస్తున్నారు.

ప్రమిదలే ముద్దు..

పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి. బంధుమిత్రులకు మిఠాయిలు పంచడం, ఇంటికి విద్యుత్తు కాంతులు వెదజల్లేలా అలంకరణ చేసుకోవడంతో పాటు వివిధ ఆకృతుల్లో ఉండే ప్రమిదల్ని వెలిగించాలి. ఒకవేళ పిల్లలు బాణాసంచా కావాలని మారాం చేస్తే వాటిని కాల్చడం వల్ల కలిగే నష్టాల్ని వివరించి నచ్చజెప్పేందుకు ప్రయత్నించాలి.

టపాసుల్లో ఏముంటాయి

బాణ సంచా తయారు చేయాలంటే రసాయనాల్ని వాడాల్సిందే. కాపర్, కాడ్మియం, సీసం, మెగ్నీషియం, సీసం, జింక్, సోడియం, అల్యూమినియం, అమ్మోనియం, పొటాషియం, సల్ఫర్, బొగ్గు వాడతారు. ఒక్కో రకం టపాసును తయారు చేసేందుకు ఒక్కో రసాయనాన్ని వినియోగిస్తారు

రసాయనాలు వాటి వల్ల కలిగే ఇబ్బందులు

రసాయనం	సమస్య
కాపర్	చిరాకు కలుగుతుంది
కాడ్మియం	రక్తప్రసరణలో ఇబ్బంది ఏర్పడుతుంది
సీసం	నరాల వ్యవస్థపై ప్రభావం
మెగ్నీషియం	మానసిక స్థిమితం కోల్పోయే ప్రమాదం
జింక్	జ్వరం, వాంతులు
సోడియం, బేరియం	కాలడం (బర్న్స్)

పదార్థం	ఎందుకు వాడతారు	ప్రభావం
యాంటిమొనీ సల్ఫేడ్	మిలమిల మెరిసేందుకు	విషపూరిత పొగ
బేరియం నైట్రేట్	మెరిసేందుకు	విషపూరిత పొగ
కాపర్ సంబంధిత పదార్థాలు	నీలం రంగు కోసం	పాలీక్లోరినేటెడ్ డయాక్సిన్లు, డై బెంజోఫ్యూరాన్లు
లిథియం	ఎర్రని కాంతుల కోసం	అలర్జీకి కారణమయ్యే పొగ
మెర్క్యురీ	క్లోరిన్ డోనర్	ప్రమాదకర భారలోహం
పొటాషియం నైట్రేట్	నల్లని పొడి	విషపూరితమైన దుమ్ము, సల్ఫర్ విడుదల
సల్ఫర్ డయాక్సైడ్	వాయువులు వెలువడేందుకు	ఆమ్ల వర్షాలకు కారణం

కలిగే ముప్పు ఇలా..

టపాసుల్ని కాల్చినప్పుడు అందులోని రసాయనాలు మండి విషపూరిత వాయువులు విడుదలవుతాయి. వాటిని పీల్చితే చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది.

'సుప్రీం' సూచనలు

పూర్తిగా బాణ సంచాను కాల్చడం నిషేధించాలంటూ గతంలో ముగ్గురు చిన్నారుల తరపున వారి తల్లిదండ్రులు సుప్రీంకోర్టులో కేసు దాఖలు చేశారు. బాణ సంచాను పూర్తిగా నిషేధించడం అసాధ్యమని ఉన్నత న్యాయస్థానం తన తీర్పులో పేర్కొంటే కొన్ని పరిమితుల్ని విధించింది. ఎట్టి పరిస్థితుల్లోనూ రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల మధ్యలో టపాసుల్ని కాల్చరాదని, భారీ శబ్దాలు చేసే వాటిని కాల్చ కూడదని సూచించింది. ప్రత్యేకించి పండుగ రోజుల్లో రాత్రి 8 నుంచి 10 గంటల వరకు మాత్రమే బాణా సంచా కాల్చాలని తీర్పులో ఆదేశించింది. దక్షిణాది రాష్ట్రాల ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా రోజులో ఏవైనా రెండు గంటల పాటు కాల్చుకోవచ్చని సడలింపు ఇచ్చింది. బాణ సంచాల వల్ల పర్యావరణానికి కలిగే నష్టాలపై సమాజంలో చైతన్యం తీసుకురావల్సిందిగా కేంద్ర కాలుష్య నియంత్రణ మండలిని ఆదేశించింది.

పర్యావరణ హితంగా పండుగ చేసుకుందాం



దీపావళి పండుగను ప్రమాదాల బారిన పడకుండా జరుపుకోవాలి. పండుగ ఆనందాన్ని పూర్తిగా ఆహ్వాదించేందుకు పర్యావరణ హితంగా నిర్వహించుకోవాలి. మట్టి దీపాలు, కొవ్వొత్తులు, విద్యుత్ దీపాలను వెలిగించడం మంచిది. నెయ్యిదీపాలు వెలిగిస్తే ఆక్సిజన్ కూడా ఎక్కువగా వెలువడుతుంది. పండుగ సంప్రదాయంలో భాగంగా టపాసులు కాల్చుకుంటాం. కానీ ఎకో ఫ్రెండ్లీ టపాసులు కాలిస్తే పర్యావరణానికి ఎలాంటి ముప్పు ఉండదు. ఈ టపాసులు సైతం మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి.

– బి.జయచంద్రారెడ్డి, విశ్రాంత అటవీ శాఖ అధికారి, పర్యావరణ ప్రేమికులు

డయాగ్నోస్టిక్ బ్లాక్‌లో ల్యాబోరేటరీ సేవలు

కర్నూలు(హాస్పిటల్): పెద్దాస్పత్రిలోని కొత్తగా నిర్మించిన డయాగ్నోస్టిక్ బ్లాక్‌లో ఏర్పాటు చేసిన ల్యాబోరేటరీ సేవలను శుక్రవారం మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆసుపత్రిలోని నూతన ల్యాబ్ ద్వారా రోగులకు రక్తపరీక్షలు సులభతరంగా అందుబాటులోకి తెచ్చామన్నారు. త్వరలో బయోకెమిస్ట్రీ, బ్లడ్ బ్యాంకు సేవలు కూడా అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఆసుపత్రిలో న్యూ డయాగ్నోస్టిక్ బ్లాక్ వల్ల ఒకేచోట రక్త పరీక్షలు, సీటీ స్కాన్, ఎక్స్‌రే, ఇతర పరీక్షలు నిర్వహించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ హేమనళిని, మైక్రోబయాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ రేణుకాదేవి, పెథాలజీ హెచ్‌ఓడీ డాక్టర్, ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాల నాగాంజన్ పాల్గొన్నారు.



ల్యాబ్ ప్రారంభం అనంతరం ల్యాబోరేటరీ వైద్యులతో ఆసుపత్రి అధికారులు

జీవనశైలి మార్పులతో దీర్ఘకాలిక వ్యాధులు

కర్నూలు(హాస్పిటల్): జీవనశైలి మార్పులతో దీర్ఘకాలిక వ్యాధులు, అసంక్రమిత వ్యాధులైన షుగర్, బీపీ, థైరాయిడ్, గుండె జబ్బులు, పలు రకాల క్యాన్సర్లు వస్తున్నాయని రాష్ట్రీ బాల స్వాస్థ్య కార్యక్రమం జిల్లా కో ఆర్డినేటర్ హేమలత చెప్పారు. స్థానిక తెలుగుగేరిలోని 9వ వార్డు సచివాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన పట్టణ ఆరోగ్య పారిశుద్ధ్యం, పోషకాహార కమిటీ సభ్యుల సమావేశంలో ఆమె మాట్లాడారు. చిన్న వయస్సులోనే గర్భం దాల్చడం వల్ల బాలికకు రక్తహీనత ఏర్పడి గర్భస్థ శిశువు సరిగా ఎదగక ఒక్కోసారి అబార్షన్ అవుతుందన్నారు. అమ్మాయికి గర్భస్థ ముఖద్వారం వృద్ధి చెందకపోవడంతో ప్రసవం కష్టతరమవుతుందన్నారు. శిశువులు కూడా వివిధ సమస్యలతో జన్మిస్తారన్నారు. బాల్యవివాహాల నిషేధ చట్టం, ఆడపిల్లల అవసరంపై విస్తృత అవగాహన కల్పించాలని కోరారు. అబ్బాయికి 25, అమ్మాయికి 21 ఏళ్ల నిండిన తర్వాతే వివాహం చేయాలన్నారు.



ఆడపిల్లలను బతకనిద్దామంటూ పోస్టర్లు ప్రదర్శిస్తున్న దృశ్యం

అమరులను స్మరించుకుందాం

కర్నూలు కల్చరల్: అటవీ శాఖలో విధి నిర్వహణలో అమరవీరులైన వారిని స్మరించుకోవాల్సిన అవసరముందని అటవీ శాఖ కర్నూలు సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ పి.రామకృష్ణ అన్నారు. శుక్రవారం అటవీ శాఖ కర్నూలు సర్కిల్ కార్యాలయంలో అటవీ శాఖ అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. అమరుల స్థూపం వద్ద విధి నిర్వహణలో అటవీ, వన్యప్రాణుల సంరక్షణలో అశువులు బాసిన అటవీ అధికారులకు, సిబ్బందికి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా చీఫ్ కన్జర్వేటర్ మాట్లాడుతూ అంకిత భావంతో విధులు నిర్వహిస్తూ విధి నిర్వహణలో జాగ్రత్తలు సైతం తీసుకోవాలన్నారు. అందరూ వన సంరక్షణ, వన్యప్రాణులను కాపాడుకునేందుకు ప్రణాళికా బద్ధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కర్నూలు ఎఫ్ఆర్ఓ సూర్యచంద్రరాజు, సోషల్ ఫారెస్ట్ రేంజర్ శ్రీనివాసులు, సర్కిల్ కార్యాలయం మేనేజర్ అబ్దుల్ సుభాన్, ఉద్యోగులు పాల్గొన్నారు.



అమర వీరులకు జోహార్లు అర్పిస్తున్న అటవీ శాఖ అధికారులు, ఉద్యోగులు

పవిత్ర అక్షింతల శోభాయాత్ర



పవిత్ర అక్షింతలకు స్వాగతం పలుకులుతున్న మహిళా శక్తి కార్యకర్తలు

కర్నూలు కల్చరల్: అయోధ్యలో భవ్య రామ మందిర నిర్మాణం పూర్తి కాబోతున్న సందర్భంగా భగవాన్ శ్రీ రామ్ లల్లా విరాజ్ మాన్ వేద మంత్రాలతో పూజించిన పవిత్ర అక్షింతల శోభా యాత్రను కర్నూలు నగరంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఓల్డ్‌సిటీ మెయిన్ బజార్‌లోని ఏకాంతరామాలయంలో పండితులు మామిళ్ల పల్లి రాజేశ్ శర్మ అక్షింతలకు పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడి నుంచి అక్షంతలతో రెవెన్యూ కాలనీలోని భరత మాత ఆలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. వీహెచ్‌పీ రాష్ట్ర కార్యాధ్యక్షులు సాయిరెడ్డి,సహ కార్యదర్శి ప్రాణేష్, ప్రాంత సహ కోశాధికారి గూడా సుబ్రమ్మణ్యం,జిల్లా అధ్యక్షులు రమణ, కోశాధికారి మహేష్, కార్యదర్శి భాను ప్రకాష్,సహ కార్యదర్శి గోవిందరాజులు, జిల్లా మాతృ శక్తి సంయోజిక సంపాల రాధిక,భజరంగ్ దల్ సంయోజక్ రాజేష్, వీహెచ్‌పీ నగర అధ్యక్షులు మద్దిలేటి, కార్యదర్శి నాగరాజు, మాతృ శక్తి నగర సంయోజిక పావని, దుర్గా వాహిని సంయోజిక సింధూర శ్రీవాణి పాల్గొన్నారు.

14న పారామెడికల్ కోర్సులకు కౌన్సెలింగ్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీలో మిగిలిపోయిన డిప్లమా ఇన్ పారామెడికల్ కోర్సులకు ఈ నెల 14న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు కళాశాలలోని న్యూ ఆడిటోరియంలో కౌన్సెలింగ్ ప్రారంభం అవుతుందన్నారు. అభ్యర్థులు తమ విద్యార్హతల ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో హాజరుకావాలని సూచించారు. డీఎంఎల్‌టీ 2, డీఈసీజీ ఒకటి, డీఆర్‌జీఏ 1 సీటు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు.

నేడు మైనారిటీ సంక్షేమ దినోత్సవం

కర్నూలు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు శనివారం మైనారిటీ సంక్షేమ దినోత్సవం, డాక్టర్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిణి ఎస్ సబీహా పర్వీన్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన అధ్యక్షతన జెడ్పీ సమావేశ భవనంలో నిర్వహించనున్న జాతీయ విద్యా దినోత్సవంలో ప్రజా ప్రతినిధులు పాల్గొంటారన్నారు.

ఎల్ఎల్సీలో వ్యక్తి గల్లంతు



షాషావలి(ఫైల్)

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని గుడేకల్ గ్రామ చెరువు సమీపంలోని ఎల్ఎల్సీలో స్నానానికి వెళ్లి శుక్రవారం సాయంత్రం షాషావలి(44) గల్లంతయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. ముగతి పేటకు చెందిన షాషావలి(44) ఫర్టిలైజర్ షాప్‌లో గుమస్తాగా పనిచేస్తున్నాడు. శుక్రవారం అదే కాలనీకి చెందిన శివనాయుడు మృతిచెందడంతో అంత్యక్రియలకు వెళ్లి స్నానం చేయటానికి ఎల్ఎల్సీ వద్దకు సైకిల్‌పై వెళ్లాడు. కాలువ గట్టు మీద చెప్పులు, సైకిల్, దుస్తులు వదలి కాలువ సిమెంట్ దిమ్మెపై కూర్చొని స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తూ కాలువలో పడిపోయాడు. షాషావలి ఎంతకూ ఇంటికి రాకపోవటంతో బంధువులు కాలువ వద్దకు వెళ్లారు. సైకిల్, దుస్తులు గట్టుపై ఉండటంతో కాలువలోకి గాలించినా ప్రయోజనం లేకపోవడంతో రూరల్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపడతామని పోలీసులు తెలిపారు.

సాక్షి స్పోర్ట్స్
శనివారం
11-11-2023



సౌత్‌జోన్ జట్టులో త్రిష

సీనియర్ మహిళల ఇంటర్ జోనల్ టి20 క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనే సౌత్‌జోన్ జట్టును ప్రకటించారు. 15 మంది సభ్యులతో కూడిన ఈ జట్టులో హైదరాబాద్ నుంచి గొంగడి త్రిష, భోగి శ్రావణి... ఆంధ్ర నుంచి బారెడ్డి అనూష, ఎస్.అనూష, నీరగట్టు అనూష ఎంపికయ్యారు. ఈ టోర్నీ ఈనెల 24 నుంచి డిసెంబర్ 4 వరకు లక్నోలో జరుగుతుంది. హైదరాబాద్‌కు చెందిన 17 ఏళ్ల త్రిష ఈ ఏడాది అండర్-19 మహిళల ప్రపంచకప్ సాధించిన భారత జట్టులో సభ్యురాలిగా ఉంది.



సెమీఫైనల్లో సుమిత్

హెల్సింకి ఓపెన్ ఏటీపీ చాలెంజర్-125 టెన్నిస్ టోర్నీలో భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్ సెమీఫైనల్లోకి ప్రవేశించాడు. ప్రపంచ 69వ ర్యాంకర్ ఎమిల్ రుసువోరి (ఫిన్‌లాండ్)తో శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 169వ ర్యాంకర్ సుమిత్ తొలి సెట్‌ను 6-3తో గెలిచి, రెండో సెట్‌లో 3-1తో ఆధిక్యంలోకి వెళ్లాడు. ఈ దశలో ఎమిల్ గాయం కారణంగా వైదొలగడంతో సుమిత్‌ను విజేతగా ప్రకటించారు. నేడు జరిగే సెమీఫైనల్లో ఇటలీ ప్లేయర్ స్టెఫానో ట్రవాగ్లియాతో సుమిత్ ఆడతాడు.

ఇరుగు దిష్టి... పొరుగు దిష్టి...

రచిన్‌కు దిష్టి తీసిన అమ్మమ్మ



సాక్షి, బెంగళూరు: వన్డే ప్రపంచకప్‌లో సంచలన ప్రదర్శన కనబరుస్తున్న న్యూజిలాండ్ క్రికెటర్ రచిన్ రవీంద్ర భారత సంతతికి చెందిన వాడని తెలిసిందే. రచిన్ కన్నడిగుడు. ఇప్పటికీ అతని మూలాలు బెంగళూరుతో ముడిపడే ఉన్నాయి. అందుకే శ్రీలంకతో మ్యాచ్ ముగియగానే రచిన్ అమ్మమ్మ ఇంటికి వెళ్లాడు. తన మనవడు పుట్టింది విదేశంలో అయినా స్వదేశీ అలవాట్లు, సంప్రదాయాలు బాగా తెలిసిన పెద్దావిడ (అమ్మమ్మ) తన ఇంటికి రాగానే రచిన్‌ను సోఫాలో కూర్చోబెట్టి దిష్టి తీసింది. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట తెగ వైరలవుతోంది. కివీస్‌లో స్థిరపడిన రచిన్ తల్లిదండ్రులు దీప, రవి కృష్ణమూర్తి బెంగళూరు వాసులు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అయిన రవి వృత్తిరీత్యా 1990లో కివీస్‌కు వలస వెళ్లగా... 1999లో వెల్లింగ్టన్‌లో రచిన్ జన్మించాడు. రవి కృష్ణమూర్తికి క్రికెట్ అంటే ఇష్టం. భారత దిగ్గజాలు సచిన్ టెండూల్కర్, రాహుల్ ద్రవిడ్‌లంటే అభిమానం. అందువల్లే తన కుమారుడికి వారిద్దరి పేర్లు కలిపి పెట్టారు. తనకిష్టమైన క్రికెట్‌లో బ్యాటర్‌ను చేశాడు.

రచిన్‌కు ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' అవార్డు



దుబాయ్: రచిన్ రవీంద్ర ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' అవార్డుకు ఎంపికయ్యాడు. ప్రస్తుత వరల్డ్‌కప్‌లో రచిన్ అత్యధిక పరుగులు (565) చేసిన రెండో బ్యాటర్‌గా కొనసాగుతున్నాడు. లీగ్ దశలో మొత్తం 9 మ్యాచ్‌లాడిన ఈ కివీస్ ఓపెనర్ 3 శతకాలు, 2 అర్ధసెంచరీలు సాధించాడు. న్యూజిలాండ్ సెమీస్ చేరడంలో కీలక భూమిక పోషించాడు. ఈ నిలకడైన ప్రదర్శనే అతనికి ఐసీసీ అవార్డుకు ఎంపిక చేసింది. రేసులో ప్రపంచకప్‌లో అత్యధిక పరుగులు చేసిన దక్షిణాఫ్రికా ఓపెనర్ డికాక్ (591), భారత సీమర్ బుమ్రా (15 వికెట్లు) ఉన్నప్పటికీ అవార్డు మాత్రం రచిన్‌నే వరించింది. 2021 జనవరి నుంచి ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' అవార్డులు ఇస్తోంది. రచిన్‌కంటే ముందు న్యూజిలాండ్ నుంచి డెవాన్ కాన్వే (2021-జూన్), ఎజాజ్ పటేల్ (2021-డిసెంబర్) ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' అవార్డులు గెల్చుకున్నారు.

శ్రీలంక క్రికెట్ బోర్డు సస్పెండ్

ఐసీసీ నిర్ణయం

దుబాయ్: శ్రీలంక క్రికెట్ బోర్డు వ్యవహారాల్లో ప్రభుత్వ జోక్యంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) కఠిన నిర్ణయం తీసుకుంది. శ్రీలంక క్రికెట్ బోర్డు సభ్యత్వాన్ని సస్పెండ్ చేస్తున్నట్లు... ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని శుక్రవారం ఐసీసీ ప్రకటించింది. ఈనెల 21న ఐసీసీ బోర్డు సమావేశం జరుగుతుందని, ఆ తర్వాతే శ్రీలంక బోర్డు భవిష్యత్ కార్యాచరణపై స్పష్టత వస్తుందని ఐసీసీ తెలిపింది. భారత్‌లో జరుగుతున్న వన్డే ప్రపంచకప్‌లో శ్రీలంక నిరాశాజనక ప్రదర్శన చేసింది. ఆడిన తొమ్మిది మ్యాచ్‌ల్లో కేవలం రెండింటిలో మాత్రమే గెలిచింది. దాంతో శ్రీలంక జట్టు ఆటతీరుపై ఆ దేశ ప్రభుత్వ క్రీడా మంత్రి రోషన్ రణసింఘె ఆగ్రహం వ్యక్తం చేస్తూ శ్రీలంక క్రికెట్ బోర్డును రద్దు చేశారు. మాజీ కెప్టెన్ అర్జున రణతుంగ నేతృత్వంలో ఏడుగురు సభ్యులతో కూడిన తాత్కాలిక కమిటీని నియమించారు. అయితే ఈ నిర్ణయంపై బోర్డు కోర్టుకు వెళ్లింది. ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుబట్టిన కోర్టు క్రికెట్ బోర్డును పునర్నియమించింది. జింబాబ్వే (2021) తర్వాత ఐసీసీ ద్వారా సస్పెన్షన్‌కు గురైన రెండో పూర్తిస్థాయి సభ్యత్వ దేశం శ్రీలంక కావడం గమనార్హం.

దర్జాగా దక్షిణాఫ్రికా గెలుపు

- ఐదు వికెట్ల తేడాతో సఫారీ విక్టరీ
- రాణించిన కొయెట్జీ, డసెన్
- ప్రపంచకప్‌ను ఓటమితో ముగించిన అఫ్గానిస్తాన్
- అజ్మతుల్లా పోరాటం వృథా


డసెన్

అహ్మదాబాద్: ఈ వన్డే వరల్డ్‌కప్‌లో అందరినీ ఆకట్టుకున్న అఫ్గానిస్తాన్ పోరాటం చివరకు పరాజయంతో ముగిసింది. ఇది వరకే సెమీఫైనల్ చేరిన దక్షిణాఫ్రికా ఆఖరి లీగ్ మ్యాచ్‌లో అఫ్గానిస్తాన్‌పై ఐదు వికెట్ల తేడాతో గెలిచి ఈనెల 16న కోల్‌కతాలో ఆస్ట్రేలియాతో జరిగే రెండో సెమీఫైనల్ పోరులో పూర్తి విశ్వాసంతో బరిలోకి దిగనుంది. నిర్ణీత తొమ్మిది లీగ్ మ్యాచ్‌లను పూర్తి చేసుకున్న దక్షిణాఫ్రికా ఏడో విజయంతో 14 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. అసాధ్యమైన సమీకరణంతో సెమీఫైనల్ ఆశలు వదులుకున్న అఫ్గానిస్తాన్ ఈ మెగా ఈవెంట్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌తోపాటు మాజీ విశ్వవిజేతలు పాకిస్తాన్, శ్రీలంకలను ఓడించామన్న సంతృప్తితో స్వదేశానికి వెళ్లనుంది. నరేంద్ర మోదీ స్టేడియంలో శుక్రవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అఫ్గానిస్తాన్ 50 ఓవర్లలో 244 పరుగుల వద్ద ఆలౌటైంది. అజ్మతుల్లా ఒమర్జాయ్ (107 బంతుల్లో 97 నాటౌట్; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు) ఒంటరి పోరాటం చేసి సెంచరీకి మూడు పరుగుల దూరంలో నిలిచాడు. దక్షిణాఫ్రికా బౌలర్లలో గెరాల్డ్ కొయెట్జీ 4, ఎన్‌గిడి, కేశవ్ మహరాజ్ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం సునాయాస లక్ష్యాన్ని దక్షిణాఫ్రికా 47.3 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 247 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' వాన్‌డర్ డసెన్ (95 బంతుల్లో 76 నాటౌట్; 6 ఫోర్లు, 1 సిక్స్) అజేయంగా నిలిచి గెలిపించాడు. అఫ్గాన్ బౌలర్లలో రషీద్ ఖాన్, మొహమ్మద్ నబీ చెరో 2 వికెట్లు తీశారు.

ఒమర్జాయ్ ఒంటరిగా...

ఓపెనర్లు ఇబ్రహీమ్ జద్రాన్ (15), రహ్మనుల్లా గుర్బాజ్ (22 బంతుల్లో 25; 3 ఫోర్లు, 1 సిక్స్) పెద్దగా రాణించలేదు. కెప్టెన్ హష్మతుల్లా (2) కూడా నిరాశపరచడంతో 45 పరుగులకే 3 వికెట్లను కోల్పోయిన అఫ్గాన్‌ను మిడిలార్డర్ బ్యాటర్ అజ్మతుల్లా ఒమర్జాయ్ ఆదుకున్నాడు. 71 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అవతలివైపు రహ్మత్ షా (46 బంతుల్లో 26; 2 ఫోర్లు), ఇక్రామ్ (12), రషీద్ ఖాన్ (14), నూర్ అహ్మద్ (32 బంతుల్లో 26; 4 ఫోర్లు) ఇలా ఏ ఒక్కరు బాధ్యతగా క్రీజులో నిలువలేకపోయినా... అజ్మతుల్లా మాత్రం కడదాకా నిలబడి ఒంటరి పోరాటం చేశాడు. శతకానికి 3 పరుగుల దూరంలో అజేయంగా నిలిచాడు. అతని పోరాటం వల్లే అఫ్గాన్ ఆ మాత్రం స్కోరు చేసింది.


ఒమర్జాయ్

స్కోరు వివరాలు

అఫ్గానిస్తాన్ ఇన్నింగ్స్: గుర్బాజ్ (సి) క్లాసెన్ (బి) కేశవ్ 25; జద్రాన్ (సి) డికాక్ (బి) కొయెట్జీ 15; రహ్మత్ షా (సి) మిల్లర్ (బి) ఎన్‌గిడి 26; హష్మతుల్లా (సి) డికాక్ (బి) కేశవ్ 2; అజ్మతుల్లా ఒమర్జాయ్ (నాటౌట్) 97; ఇక్రామ్ (సి) డికాక్ (బి) కొయెట్జీ 12; నబీ (సి) డికాక్ (బి) ఎన్‌గిడి 2; రషీద్ ఖాన్ (సి) డికాక్ (బి) ఫెలుక్‌వాయో 14; నూర్ అహ్మద్ (సి) డికాక్ (బి) కొయెట్జీ 26; ముజీబ్ (సి) మార్క్‌రమ్ (బి) కొయెట్జీ 8; నవీనుల్ (రనౌట్) 2; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (50 ఓవర్లలో ఆలౌట్) 244. వికెట్ల పతనం:** 1-41, 2-41, 3-45, 4-94, 5-112, 6-116, 7-160, 8-204, 9-226, 10-244. **బౌలింగ్:** రబడ 10-0-40-0, ఎన్‌గిడి 8.3-0-69-2, మార్క్‌రమ్ 4.3-0-25-0, కొయెట్జీ 10-1-44-4, కేశవ్ మహరాజ్ 10-1-25-2, ఫెలుక్‌వాయో 7-0-36-1.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: డికాక్ (ఎల్బీడబ్ల్యూ) (బి) నబీ 41; బవుమా (సి) గుర్బాజ్ (బి) ముజీబ్ 23; డసెన్ (నాటౌట్) 76; మార్క్‌రమ్ (సి) నవీనుల్ (బి) రషీద్ 25; క్లాసెన్ (బి) రషీద్ ఖాన్ 10; మిల్లర్ (సి అండ్ బి) నబీ 24; ఫెలుక్‌వాయో (నాటౌట్) 39; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (47.3 ఓవర్లలో 5 వికెట్లకు) 247. వికెట్ల పతనం:** 1-64, 2-66, 3-116, 4-139, 5-182. **బౌలింగ్:** ముజీబ్ 10-0-51-1, నవీనుల్ 6.3-0-52-0, నబీ 10-1-35-2, ఒమర్జాయ్ 1-0-8-0, రషీద్ ఖాన్ 10-1-37-2, నూర్ అహ్మద్ 9-0-49-0, రహ్మత్ షా 1-0-12-0.

ఆదుకున్న డసెన్

సునాయాస లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఓపెనర్లు డికాక్ (47 బంతుల్లో 41; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), కెప్టెన్ బవుమా (28 బంతుల్లో 23; 3 ఫోర్లు) తొలి వికెట్‌కు 64 పరుగులు జోడించి మంచి ఆరంభమే ఇచ్చారు. అయితే మార్క్‌రమ్ (32 బంతుల్లో 25; 1 ఫోర్, 1 సిక్స్), క్లాసెన్ (10) లాంటి కీలక బ్యాటర్లు విఫలమవడంతో 139 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో వన్‌డౌన్‌లో బ్యాటింగ్‌కు దిగిన డసెన్... మిల్లర్ (33 బంతుల్లో 24; 1 ఫోర్, 1 సిక్స్)తో కలిసి పరిస్థితి చక్కదిద్దాడు. తర్వాత ఫెలుక్‌వాయో (37 బంతుల్లో 39 నాటౌట్; 1 ఫోర్, 3 సిక్సర్లు) ధాటిగా ఆడటంతో దక్షిణాఫ్రికా సంచలనానికి తావివ్వకుండా గెలిచింది. అబేధ్యమైన ఆరో వికెట్‌కు డసెన్, ఫెలుక్‌వాయో 65 పరుగులు జోడించారు.

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్	8	8	0	16	2.456
దక్షిణాఫ్రికా	9	7	2	14	1.261
ఆస్ట్రేలియా	8	6	2	12	0.861
న్యూజిలాండ్	9	5	4	10	0.743
పాకిస్తాన్	8	4	4	8	0.036
అఫ్గానిస్తాన్	9	4	5	8	-0.336
ఇంగ్లండ్	8	2	6	4	-0.885
బంగ్లాదేశ్	8	2	6	4	-1.142
శ్రీలంక	9	2	7	4	-1.419
నెదర్లాండ్స్	8	2	6	4	-1.635

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ప్రపంచకప్‌లో నేడు

ఆస్ట్రేలియా × బంగ్లాదేశ్
వేదిక: పుణే
ఉదయం గం. 10:30 నుంచి

ఇంగ్లండ్ × పాకిస్తాన్
వేదిక: కోల్‌కతా
మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

రన్నరప్ నైశిక్ రెడ్డి జోడీ



సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య జూనియర్ సర్క్యూట్ టోర్నీలో తెలంగాణకు చెందిన గనగామ నైశిక్ రెడ్డి రన్నరప్‌గా నిలిచాడు. ఢాకాలో జరిగిన ఈ టోర్నీలో నైశిక్ రెడ్డి-ప్రబీర్ ముకేశ్ చావ్లా (భారత్) ద్వయం బాలుర డబుల్స్ విభాగం ఫైనల్లో ఓటమి చవిచూసింది. తుది పోరులో నైశిక్-ప్రబీర్ జోడీ 2-6, 3-6తో భారత్‌కే చెందిన తవీశ్ పావా-అర్ణవ్ యాదవ్ జంట చేతిలో ఓటమి పాలైంది.

సెమీస్‌లో అభయ్ నిష్క్రమణ



న్యూఢిల్లీ: నియోస్ వెనిస్ వెర్టె ఓపెన్ స్క్వాష్ టోర్నీలో భారత ప్లేయర్ అభయ్ సింగ్ సెమీఫైనల్లో నిష్క్రమించాడు. ఫ్రాన్స్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో శుక్రవారం రెండో సీడ్ రోరీ స్టీవర్ట్ (స్కాట్లాండ్)తో జరగాల్సిన సెమీఫైనల్లో అభయ్ గాయం కారణంగా బరిలోకి దిగకుండా తన ప్రత్యర్థికి వాకోవర్ ఇచ్చాడు. క్వార్టర్ ఫైనల్లో అభయ్ 11-1, 7-11, 19-17, 8-11, 11-6తో ఆరో సీడ్ విక్టర్ బైర్టస్ (చెక్ రిపబ్లిక్)పై గెలిచాడు.

సినిమా

సూపర్ స్టార్ కృష్ణ విగ్రహావిష్కరణ


● బెల్లం దుర్గ, దేవినేని అవినాష్, ఘట్టమనేని బాబీ, కమల్‌హాసన్

సూపర్‌స్టార్ కృష్ణ విగ్రహాన్ని ప్రముఖ నటుడు కమల్‌హాసన్ ఆవిష్కరించారు. విజయవాడలోని గురునానక్ కాలనీ కేడీజీఓ పార్కులో కృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. 'భారతీయుడు 2' చిత్రం షూటింగ్ కోసం విజయవాడలో ఉన్న కమల్‌హాసన్.. కృష్ణ-మహేశ్‌బాబు ఫ్యాన్స్ ఆహ్వానం మేరకు కృష్ణ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ''కృష్ణగారి విగ్రహావిష్కరణలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉంది'' అన్నారు కమల్‌హాసన్. ఈ విగ్రహావిష్కరణలో పాల్గొన్న విజయవాడ తూర్పు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్ మాట్లాడుతూ- ''కళామతల్లికి తనదైన శైలిలో సేవలందించి, ప్రేక్షకుల మనసులో సుస్థిర స్థానాన్ని ఏర్పరచుకున్నారు కృష్ణగారు. తండ్రి గౌరవాన్ని మహేశ్‌బాబుగారు నిలబెడుతున్నారు'' అన్నారు. ''కృష్ణగారి విగ్రహావిష్కరణ కేవలం పదిరోజుల వ్యవధిలో పూర్తి చేసేందుకు సహకరించిన సీఎం జగన్ మోహన్ రెడ్డిగారికి కృతజ్ఞతలు'' అని కృష్ణ అభిమానుల సంఘం పేర్కొంది. ఈ కార్యక్రమంలో విజయవాడ డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కృష్ణ కుటుంబ సభ్యుడు ఘట్టమనేని బాబీ, వైఎస్సార్‌సీపీ నాయకులు గల్లా పద్మావతి, రాజ్‌కమల్ పాల్గొన్నారు.

గర్వంగా ఉంది: హీరో మహేశ్‌బాబు

''నాన్నగారి విగ్రహాన్ని ఆవిష్కరించిన కమల్ హాసన్‌గారికి కృతజ్ఞతలు. నాన్నగారు వదిలి వెళ్లిన జ్ఞాపకాలు, వారసత్వానికి ఇదొక నివాళి. నాన్న విగ్రహం ఏర్పాటుకు కారణమైన అందరికీ, ఈ వేడుక ఘనంగా నిర్వహించిన అభిమానులకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు'' అంటూ ట్వీట్ చేశారు మహేశ్ బాబు.


● కాజల్

వేటాడే సత్యభామ

'సత్యా.. ఈ కేసు నీ చేతుల్లో లేదు (ప్రకాశ్‌రాజ్).. కానీ ఆ ప్రాణం నా చేతుల్లోనే పోయింది సార్ (కాజల్ అగర్వాల్)' అనే డైలాగ్స్‌తో మొదలవుతుంది 'సత్యభామ' టీజర్. పోలీసాఫీసర్ సత్యభామ పాత్రలో కాజల్ అగర్వాల్ నటిస్తున్న చిత్రం ఇది. ప్రకాశ్‌రాజ్, నవీన్ చంద్ర కీలక పాత్రధారులు. బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపెల్లి నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి దర్శకుడు శశికిరణ్ తిక్క సమర్పకులుగా వ్యవహరిస్తూ స్క్రీన్‌ప్లే అందించారు. శుక్రవారం 'సత్యభామ' టీజర్‌ను రిలీజ్ చేశారు. 'సార్.. ఆ గిల్ట్ నన్ను వెంటాడుతూనే ఉంది. వేటాడాలి (కాజల్ అగర్వాల్)', 'ఆ అమ్మాయి చావుకు మీరే కారణం అంటున్నారు. ఈ కేసును మీరు వదిలేసినట్లేనా? (విలేకర్లు).. నెవర్ (కాజల్)' అనే డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. ఈ చిత్రానికి సంగీతం: శ్రీచరణ్ పాకాల.

ఇళయరాజా బయోపిక్‌లో ధనుష్


● ధనుష్, ఇళయరాజా

సంగీత జ్ఞాని ఇళయరాజా జీవితం వెండితెరపైకి రానుంది. ఇందులో ధనుష్ ఓ ప్రధాన పాత్రలో నటించనున్నారు. మెర్క్యూరీ గ్రూప్, కనెక్ట్ మీడియా సంస్థలు ఈ బయోపిక్‌ను నిర్మించనున్నాయి. వచ్చే ఏడాది అక్టోబరులో ఈ చిత్రం షూటింగ్ ప్రారంభించి, 2025 ఏడాది మధ్యలో రిలీజ్ చేయాలనుకుంటున్నారు. ఈ సందర్భంగా మెర్క్యూరీ గ్రూప్ సీఈవో, ఎండీ శ్రీరామ్ భక్తి శరణ్ మాట్లాడుతూ -''ప్రాంతీయ కథలతో సినిమాలు తీస్తే అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తోంది. అందుకే లోకల్, ప్రాంతీయ కథలను అంతర్జాతీయ స్థాయిలో తెరకెక్కించాలనుకుంటున్నాం'' అన్నారు. ''రాబోయే రెండు దశాబ్దాల్లో భారతీయ వినోద పరిశ్రమ మరింత అభివృద్ధి చెందుతుంది. ప్రపంచ వినోద పరిశ్రమలో ప్రసిద్ధి చెందిన మెర్క్యూరి సంస్థతో మెగా బడ్జెట్ సినిమాలను నిర్మించడానికి వారితో చేతులు కలపడం మాకు సంతోషంగా ఉంది'' అని కనెక్ట్ మీడియా ప్రతినిధి వరుణ్ మాథుర్ అన్నారు.

కొత్తవాళ్లతో సినిమా పెద్ద బాధ్యత - నిహారిక

''మా పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్‌లో ఇప్పటివరకు వెబ్ సిరీస్‌లు, షార్ట్ ఫిలింస్ చేశాం. తొలిసారి ఫీచర్ ఫిల్మ్ ప్రారంభించాం. ఇంతమంది కొత్తవాళ్లతో సినిమా చేయటం పెద్ద బాధ్యతగా భావిస్తున్నాను'' అన్నారు నిహారిక కొణిదెల. యదు వంశీ దర్శకత్వంలో నిహారిక కొణిదెల సమర్పణలో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ ఎల్ఎల్‌పీ, శ్రీ రాధా దామోదర్ స్టూడియోస్‌పై పద్మజ కొణిదెల, జయలక్ష్మి అడపాక నిర్మిస్తున్న చిత్రం శుక్రవారం ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి నటుడు నాగబాబు కెమెరా స్విచ్చాన్ చేయగా, హీరో వరుణ్ తేజ్ క్లాప్ కొట్టారు. డైరెక్టర్ వెంకీ కుడుముల గౌరవ దర్శకత్వం వహించగా, నిర్మాత అల్లు అరవింద్ స్క్రిప్ట్‌ని యూనిట్‌కి అందించారు. యదు వంశీ మాట్లాడుతూ- ''ఈ సినిమా ద్వారా 11 మందిని హీరోలుగా, నలుగురిని హీరోయిన్లుగా పరిచయం చేస్తున్నాం'' అన్నారు. ''ఈ చిత్రంతో నేను, నా సతీమణి జయలక్ష్మి నిర్మాతలుగా పరిచయమవుతున్నాం'' అన్నారు శ్రీరాధా దామోదర్ స్టూడియోస్ అధినేత ఫణి. ఈ చిత్రానికి కెమెరా: రాజు ఎడురోలు, సంగీతం: అనుదీప్ దేవ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మన్యం రమేశ్.


● యూనిట్‌కి స్క్రిప్ట్ అందిస్తున్న అల్లు అరవింద్

లింగి లింగిడి..!


● రాహుల్, శివానీ, మిథున్, తేజా మార్ని, 'బన్నీ' వాసు, విద్య

శ్రీకాంత్ మేక, రాహుల్ విజయ్, శివానీ రాజశేఖర్, వరలక్ష్మీ శరత్‌కుమార్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'కోట బొమ్మాళి పీఎస్'. తేజా మార్ని దర్శకత్వంలో 'బన్నీ' వాసు, విద్యా కొప్పినీడి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 24న విడుదల అవుతోంది. రంజిన్ రాజ్, మిథున్ ముకుందన్ స్వరపరచిన ఈ చిత్రంలోని 'లింగి లింగిడి..' అంటూ సాగే పాటను ఇటీవల విడుదల చేయగా, 30 మిలియన్ వ్యూస్‌ను పూర్తి చేసుకుంది. ''ఈ పాటలానే మా చిత్రానికి ప్రేక్షకులు విజయం అందిస్తారనే నమ్మకం ఉంది'' అని హైదరాబాద్‌లో నిర్వహించిన సెలబ్రేషన్స్‌లో 'బన్నీ' వాసు అన్నారు.


● జాన్వీ కపూర్

రెండు హృదయాల కల

'రూహి' చిత్రం తర్వాత రాజ్ కుమార్ రావు, జాన్వీ కపూర్ ప్రధాన పాత్రల్లో నటించిన తాజా చిత్రం 'మిస్టర్ అండ్ మిసెస్ మహి'. 'నో డ్రీమ్ ఈజ్ ఎవర్ చేజ్డ్ ఎలోన్!' అనేది క్యాప్షన్. క్రికెట్ నేపథ్యంలో రూపొందిన ఈ స్పోర్ట్స్ డ్రామా ఫిల్మ్‌కు శరణ్‌శర్మ దర్శకత్వం వహించగా, కరణ్ జోహార్ నిర్మించారు. ''ఒకే కల కోసం రెండు హృదయాలు ఎదురు చూస్తున్నాయి'' అంటూ ఈ మూవీని ఏప్రిల్ 19న రిలీజ్ చేయనున్నట్లుగా జాన్వీ కపూర్ అండ్ టీమ్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు.

మాస్ రింగు...


● సోహైల్

'బిగ్ బాస్' ఫేమ్ సోహైల్ హీరోగా నటించిన తాజా చిత్రం 'బూట్‌కట్ బాలరాజు'. శ్రీ కోనేటి దర్శకత్వంలో గ్లోబల్ ఫిలిమ్స్- కథ వేరుంటాది బ్యానర్స్‌పై ఎండీ పాషా నిర్మిస్తున్నారు. మేఘా లేఖ, సునీల్, సిరి హన్మంత్, ఇంద్రజ కీలక పాత్రలు పోషిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'రింగు రింగు బిళ్ల..' అంటూ సాగే టైటిల్ సాంగ్‌ను విడుదల చేశారు. ఈ పాటకి దేవ్ పవార్ సాహిత్యం అందించగా, భోలే షావలి, రఘు రామ్ పాడారు. ప్రేమ్ రక్షిత్ మాస్టర్ కొరియోగ్రఫీ అందించారు. ''ఫుల్ మాస్‌గా 'రింగు రింగు బిళ్ల..' సాంగ్ ఉంటుంది. సోహైల్ చేసిన మాస్ డ్యాన్స్ మూమెంట్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి'' అన్నారు మేకర్స్.

సరికొత్త ట్రయల్

స్పందన పల్లి, యుగ్ రామ్, వంశీ కోటు ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ది ట్రయల్'. స్మృతీ సాగి, శ్రీనివాస నాయుడు కిల్లాడ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 24న విడుదల కానుంది. ''ఇప్పటివరకు తెలుగు తెరపై చూడని కంప్లీట్ ఇంటరాగేటివ్ కథతో, సరికొత్త సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌తో ఈ సినిమా కథనం ఉంటుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: శరవణ వాసుదేవన్, సహనిర్మాత: సుదర్శన్ రెడ్డి.


● 'ది ట్రయల్' పోస్టర్

ప్రేమలో గీతాశంకరం


● ప్రియాంక, ముఖేష్ గౌడ

ముఖేష్ గౌడ, ప్రియాంకా శర్మ జంటగా కె.దేవానంద్ నిర్మిస్తున్న ప్రేమకథా చిత్రం 'గీతా శంకరం'. దీపావళి సందర్భంగా ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ముఖేష్ గౌడ మాట్లాడుతూ- ''సీరియల్స్‌లో పేరు సంపాదించుకున్నట్లే ఈ సినిమాతో వెండితెరపై కూడా మంచి పేరు తెచ్చుకుంటాననే నమ్మకం ఉంది'' అన్నారు. ''నటనకు మంచి స్కోప్ ఉన్న పాత్ర లభించడం నా లక్‌గా భావిస్తున్నా'' అన్నారు ప్రియాంకా శర్మ. ''ఇరవై కథలు విన్నాం. కానీ రుద్ర చెప్పిన ఈ కథ నచ్చడంతో ఈ సినిమా చేస్తున్నాం. ఈ నెల 14న కొత్త షెడ్యూల్ ఆరంభిస్తాం'' అన్నారు దేవానంద్. ''ప్రేక్షకులకు నచ్చే అంశాలన్నీ ఈ సినిమాలో ఉంటాయి'' అన్నారు రుద్ర. ఈ చిత్రానికి సంగీతం: అబు, కెమెరా: ఉదయ్ ఆకుల.

మంచి సినిమా అంటున్నారు - నిర్మాత సాయి సుధాకర్



''అలా నిన్ను చేరి' చిత్రానికి ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. మరీ ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల ప్రేక్షకుల నుంచి ఎక్కువగా స్పందన వస్తోంది. వారంతా ఫస్ట్ హాఫ్‌కి ఎక్కువగా కనెక్ట్ అవుతున్నారు'' అని కొమ్మాలపాటి సాయి సుధాకర్ అన్నారు. దినేష్ తేజ్, హెబ్బా పటేల్, పాయల్ రాధాకృష్ణ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'అలా నిన్ను చేరి'. మారేష్ శివన్ దర్శకత్వం వహించారు. కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మించిన ఈ సినిమా శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా కొమ్మాలపాటి సాయి సుధాకర్ మాట్లాడుతూ-''మా సినిమా చూసిన చాలామంది తమ జీవితాన్ని చూసుకున్నట్టుగా ఉందనడం సంతోషం. 'అలా నిన్ను చేరి' నిర్మాతగా మొదటి సినిమా అయినా కథకి అవసరం మేరకు ఖర్చు పెట్టా. సినిమా చూసిన మా నాన్నగారు బాగా తీశారని మెచ్చుకున్నారు. నా తర్వాతి సినిమా కోసం ప్రస్తుతం థ్రిల్లర్ జానర్‌లో ఓ కథ విన్నాను'' అన్నారు.